బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

● మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి, నాయకులు

బొమ్మలరామారం, డిసెంబర్ 20 : బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాదాపురంలో శుక్రవారం జరిగిన కంచల్ తండా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువ జన విభాగం మండల నాయకుడు మాడోతు రమేశ్‌నాయక్ వివాహానికి ఆమె హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు రాజునాయక్, సుమన్‌నాయక్, మోహన్‌నాయక్, శ్రీనూనాయక్, రమేశ్, వినోద్, పరమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులతో గొంతు నొక్కుతున్నారు

● మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని అక్రమ కేసులు బనాయించి గొంతు నొక్కుతున్నారని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్.. బీఆర్ఎస్ పార్టీని, కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా బనాయిస్తున్న కేసులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అసెంబ్లీలో చర్చకు ధైర్యం చేయలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూడడం అమాయకత్వమేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైనికులం, తెలంగాణ ఉద్యమ పోరాటం నుంచి పుట్టుకొచ్చిన తమను చిల్లర వ్యూహాలు భయపెట్టలేవని అన్నారు. హామీలు అమలు చేయలేక ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత కేటీఆర్‌దన్నారు. రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా ఈ రేస్‌ను రద్దు చేయడమే కాకుండా నిర్వహణలో అవినీతి జరిగిందంటూ కేటీఆర్‌పై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వస్తున్నాయని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంగోని ఉప్పలయ్యగౌడ్, నాయకులు నాగిర్తి జనార్దన్‌రెడ్డి, బూరుగు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటు

సింగారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడం సిగ్గుచేటు అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని సింగారం గ్రామంలో పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిలదీయడాన్ని జీర్ణించుకోలేని సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. హామీలను నెరవేర్చకుంటే రానున్న రోజుల్లో కాంగ్రెస్ నాయకులను, ప్రజాప్రతినిధులను ప్రజలు తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పలయ్య, వెంకటేశ్‌గౌడ్, అరుణ, దశరథగౌడ్, సత్తయ్యగౌడ్, యాదగిరిగౌడ్, లక్ష్మీనారాయణ, శ్రీహరి, సైదులు, శంకర్, రాంరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, అబ్బసాయిలు పాల్గొన్నారు.

'స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

తాసీల్దార్ రాంప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న మండల అఖిలపక్ష నాయకులు

మోత్కూరు, డిసెంబర్ 20 : మున్సిపాలిటీలో మినీ స్టేడియం నిర్మాణం కోసం దాత అందించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షాల నాయకులు శుక్రవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని కేజీబీవీ సమీపంలో సర్వే నెంబర్ 860/61లో 6.12 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన దాత టి.బాలశౌరి విరాళంగా ఇచ్చారని తెలిపారు. సదరు భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని తెలిపారు. తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అఖిలపక్షాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, యానాల దామోదర్‌రెడ్డి, బొల్లు యాదగిరి, పి.మల్లేశ్, నాగార్జున్‌రెడ్డి, బయ్యని రాజు, సత్యనారాయణ చారి, బొల్లేపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మోత్కూరు, డిసెంబర్ 20 : పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపాలిటీలో నిషేధిత మాదక ద్రవ్యాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సాంస్కృతిక సారథి కళాకారులు ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకన్న, కళాకారులు కృష్ణ, నరేందర్, రంగన్న, సురేశ్, లింగస్వామి, చరణ్‌రాజ్, జహంగీర్, శంకర్, తేజ, లావణ్య పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్ట్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 20 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా ఆటో డ్రైవర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు కదిరె దశరథ, డ్రైవర్లు ఆంజనేయులు, కృష్ణంరాజు, మల్లేశ్, శేఖర్, నరేశ్, నర్సింహ, సైదులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ రామకృష్ణ

ఆలేరు టౌన్, డిసెంబర్ 20 : మండలంలోని మంతపురి గ్రామానికి చెందిన గుళ్లపల్లి కావ్య ఏపీజీవీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఆమె ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందగా.. బీమా సొమ్ము రూ.2లక్షలు మంజూరయ్యాయి. నామినీ అయిన కావ్య భర్త శ్రీనివాస్‌కు ఆలేరులో ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ సీహెచ్ రామకృష్ణ శుక్రవారం బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకుమిత్ర రాజేశ్వరి, వీబీకే కొమ్మగాని సునీత పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

● కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన భూ నిర్వాసితులు

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు

చౌటుప్పల్, డిసెంబర్ 20 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ చౌటుప్పల్, భువనగిరి, వలిగొండ, గజ్వేల్ తదితర ప్రాంతాల రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు శుక్రవారం కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఢిల్లీలోని ఆయన కార్యాయలంలో కలిశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మిగతా రహదారులకు ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డుకు 40 కిలోమీటర్లు అలైన్‌మెంట్ తీసుకొని ఉత్తర భాగంలో 28కిలోమీటర్లకు పరిమితం చేశారని తెలిపారు. దీంతో చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల్లో మున్సిపాలిటీ రెండుగా విడిపోతుందన్నారు. దీని మూలంగా హెచ్ ఎండీఏ ప్లాట్లు, విలువైన భూములు, గృహాలు కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ కూడా ఓఆర్ఆర్ నుంచి 40కిలోమీటర్లు మార్చి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై పునరాలోచన చేసి న్యాయం చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు భూ నిర్వాసితులు తెలిపారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మారుపాక లింగం గౌడ్, దబ్బేటి రాములు గౌడ్, జాల వెంకటేశం యాదవ్, బోరెం ప్రకాశ్‌రెడ్డి, కొడారి నర్సింగ్‌రావు, మోదుగు అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలి

● గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 20 : గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో నిర్వహించే గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో శుక్రవారం కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ 100 సంవత్సరాల క్రితం ప్రవచించిన అంశాలను ఐక్యరాజ్య సమితి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గుర్తించిందన్నారు. సుస్థిర విద్య, ప్రకృతి వైద్యం, సేంద్రీయ వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, సుస్థిర ఇంధన వనరులు, పర్యావరణం, సుస్థిర క్రీడలు, మహిళా సాధికారత, నీటి సంరక్షణ వంటి అంశాలపై సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజ్ఞానాన్ని స్టాల్స్ ద్వారా ప్రదర్శిస్తూ గాంధీ ఫొటో గ్యాలరీ, చరక ప్రదర్శన, గ్రామ నిర్మాణ ఇంజినీర్ల ప్రదర్శన, మిల్లెట్, పురాతన, ఆధునిక వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన, ప్రకృతి వ్యవసాయదారుల పంటల ప్రదర్శన, ఎద్దుగానుగ ప్రదర్శన, మల్కం గేమ్, యోగా ప్రదర్శనతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు బృందం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. సేంద్రియ, సమీకృత వ్యవసాయం చేస్తూ భూమిని సంరక్షిస్తున్న 115 మంది ఉత్తమ రైతు దంపతులకు పుడమి మిత్ర అవార్డులు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 35 మంది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, జర్నలిస్టులు, ఎఫ్‌పీఓలకు కిసాన్ సేవారత్న అవార్డులు అందించి సత్కరిస్తామని తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు, ఉద్యానవన శాఖ రాష్ట్ర కమిషనర్ షేక్ యాస్మిన్ భాషా, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఆర్గనైజింగ్ పెక్రటరీ మెరుగు మధు, జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్, కార్యక్రమ కన్వీనర్ పడమటి పావని, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ చైర్మన్ బాలరాజు, జిల్లా ప్రతినిధులు కాదూరి అచ్చయ్య, దుర్గా ప్రసాద్, విశ్రాంత పశు వైద్యశాఖ జేడీ మదన్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 20 : రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతిచెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని దమ్మాయిగూడేనికి చెందిన మాదిరెడ్డి సంధ్య (35), కుమారుడు క్రాంతి (15) శుక్రవారం తమ సొంత గ్రామమైన జనగామ మండలంలోని ఎర్రగొల్లపాలెం గ్రామానికి యాక్టివాపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో యాదగిరిగుట్ట మండలంలోని తాళ్లగూడెం స్టేజీ వద్ద వెనుక నుంచి వచ్చిన మహీంద్రా వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో గాయాలపాలైన వారిని ఆలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

రాజాపేట, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని బంటుగూడెంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందాడు. బంటుగూడెం గ్రామానికి చెందిన గొల్లెన భిక్షపతి (55) శుక్రవారం బైక్‌పై రాజాపేట నుంచి బంటుగూడెం వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతిచెందాడు. భిక్షపతికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

బొమ్మలరామరం : మండలంలోని బండకాడిపల్లి గ్రామంలో తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. బండకాడిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోనాల మల్లయ్య గౌడ్ గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు మోకు జారి కింద పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన మల్లయ్యను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి : ఎంపీడీఓ

సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్‌గౌడ్

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 20 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పిలాయిపల్లి, జూలూరు, పెద్దగూడెం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును సర్వే చేయాలన్నారు. తప్పులు లేకుండా పారదర్శకంగా సర్వే చేపట్టి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ నాగేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ.. ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు

రాజాపేట, డిసెంబర్ 20 : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారుతుందని ఆ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మి తెలిపారు. రాజాపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనవరి 1నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. బ్యాంకు పేరు మార్పు సందర్భంగా ఈ నెల 28నుంచి 31 వరకు బ్యాంకు సేవలు, నెట్ మొబైల్ బ్యాంకింగ్, ఫోన్ పే, గూగుల్ పే సేవలు నిలిచిపోనున్నాయని తెలిపారు. ఈ నెల 27లోపు అత్యవసరమైన బ్యాంకింగ్ సేవా కార్యక్రమాలను నిర్వహించుకోవాలని సూచించారు. జనవరి ఒకటో తేదీన తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు.

సమయానుకూలంగా బస్సులు నడుపాలి : ఎస్ఎఫ్ఐ

మందళ్లగూడెంలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్ 20 : విద్యార్థుల సమయానికి అనుకూలంగా గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులు నడుపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్ అన్నారు. మండలంలోని మందళ్లగూడెం గ్రామంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలపట్ల, కుంట్లగూడెం గ్రామాల మీదుగా మందళ్లగూడెంలోకి కొంతకాలంగా బస్సు సమయానికి రాకపోవడంతో కాలేజీలు, వివిధ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బస్సులు సమయానుకూలంగా నిడిచేలా చర్యలు తీసుకోవాలని నార్కట్‌పల్లి ఆర్టీసీ డీఎంను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, కొండె శ్రీశైలం, బోదాసు నరేశ్, తీగుళ్ల శ్రీనివాస్, రుద్రగోని మధు, జంగిలి సాయినాథ్, మాదగోని లింగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నాయకుల ముందస్తు అరెస్టు

రామన్నపేట, డిసెంబర్ 20 : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న రామన్నపేట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ అన్నారు. అరెస్టు అయిన వారిలో ఎర్ర రమేశ్, ఊట్కూరి భగవంతం, యాదగిరి, సమ్మయ్య, కృష్ణ ఉన్నారు.

అడ్డగూడూరు : ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని చలో అసెంబ్లీకి పిలుపునివ్వడంతో శుక్రవారం ఉదయం 6గంటలకు ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలను నివారించాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

రామన్నపేట : సీపీఐ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అడ్డగూడూరు : ఏఐఎస్ఎఫ్ నాయకుడిని ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి ఉపేందర్‌రెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి ఉపేందర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 20 : సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి, జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె 11వ రోజూ కొనసాగింది. వారి సమ్మెకు శుక్రవారం ఉపేందర్‌రెడ్డి, విశ్రాంత ఎంఈఓ లక్ష్మీనారాయణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ 11 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో ఒప్పంద ఉద్యోగులుగా రిక్రూట్ చేసి కొంత కాలపరిమితి తర్వాత క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంటుందన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల పోరాటానికి రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ముఖ్యమంత్రి స్పందించి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంగ పాండరి, తిరుపతి, నాయకులు నాగార్జున, అరుణ, సంధ్యారాణి, కృష్ణ, సంజీవ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎస్‌జీఆర్ఈఏ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సన్మానం పొందిన విశ్రాంత ఉద్యోగులు

మోత్కూరు, డిసెంబర్ 20 : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌జీఆర్ఈఏ జిల్లా అధ్యక్షుడు కె.మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో శుక్రవారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన వారికి గత ఏప్రిల్ నుంచి రావాల్సిన పెన్షనరీ బెన్‌ఫిట్స్ ఇవ్వడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తున్నదన్నారు. పెన్షనర్ల డీఏ బకాయిలు, పీఆర్సీ ఫిట్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వానికి ఎన్నోసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని కోరారు. అనంతరం 70 సంవత్సరాలు పైబడిన 14 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.యాదిరెడ్డి, వల్లభాయి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు జాగ్రత్తలు చేపట్టాలి

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ రాజశేఖర్

పశువుకు చికిత్స చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 20 : పశు సంరక్షణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని కనుముక్కుల, దంతూరు, వంకమామిడి గ్రామాల్లో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 303 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం ఉత్తమ దూడల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పశు వైద్యాధికారులు అశోక్, శ్రీనివాస్, రఘు, వెంకటేశ్, రామచంద్రారెడ్డి, పృథ్వీ, పశు వైద్య సిబ్బంది రమేశ్, జమీల్, మహేశ్, లింగస్వామి, రాజు, బాలనరసింహ, వేణుగోపాల్, శేఖర్ పాల్గొన్నారు.

పశువుల్లో కృత్రిమ గర్భ ధారణపై రైతులకు అవగాహన

తాళ్లగూడెంలో పశువుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల పశు వైద్యాధికారి శ్రీకాంత్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 20 : మేలు జాతి పాడి పశువులు, కృత్రిమ గర్భధారణపై రైతులకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అవగాహన కల్పించారు. మండలంలోని పెద్దకందుకూరు గోపాల మిత్ర కేంద్రమైన తాళ్లగూడెంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి తగిన చికిత్స చేపట్టారు. ఎదలో ఉన్న వాటికి కృత్రిమ గర్భధారణ చేశారు. చూడి పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు, కాల్షియం టానిక్ అందజేశారు. విటమిన్ ఇంజిక్షన్లు, పాల దిగుబడిని పెంచే ఖన